కక్షిదారులు రాజీ కుదుర్చుకోవాలి

నర్సాపూర్ కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి అనిత

నర్సాపూర్, జూన్ 8: కక్షిదారులు పట్టింపులకు పోకుండా రాజీ కుదుర్చుకుంటే డబ్బు, సమయం కలిసి వస్తుందని జూనియర్ సివిల్ జడ్జి అనిత అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నర్సాపూర్ కోర్టులో నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి అనిత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇరువర్గాలు తగాదా పడి, కేసులు నమోదై కోర్టు చుట్టూ తిరుగుతూ తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవాలని సూచించారు. భూ తగాదాలతో చాలా ఏండ్లు కోర్టు కేసులు కొనసాగుతూ అంతిమ తీర్పు కోసం ఎదురుచూస్తూ ఇబ్బందులు పడుతుంటారన్నారు. ఇరువర్గాలు కూర్చొని కక్షలు, పట్టింపులు పక్కనపెట్టి సామరస్యంగా భూ తగాదాలు పరిష్కరించుకోవాలని సూచించారు. బ్యాంకు రుణాలు తీసుకున్నప్పుడు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, తదనంతరం వారి కుటుంబంపై భారం పడకుండా ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చట్టపరమైన సమస్యలు తలెత్తినప్పుడు న్యాయ సాయం కోసం మండల లీగల్ సర్వీస్ కమిటీని ఆశ్రయించి, ఉచితంగా న్యాయ సలహాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీపీ ఆర్.రాఘవేంద్ర, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ సత్యనారాయణ, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్ మధుశ్రీ, న్యాయవాదులు స్వరూపారాణి, అంజిరెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, సీఐ జాన్‌రెడ్డి, ఏఎస్సై శ్రీనివాస్, ఎక్సైజ్ ఎస్సై రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థికసాయం చేస్తున్న జడ్పీటీసీ మహేశ్‌గుప్తా

శివ్వంపేట, జూన్ 8: శివ్వంపేటకు చెందిన చింతకింది భిక్షపతికి ఇటీవల ఓ ప్రమాదంలో కాలు విరిగింది. శనివారం జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆ కుటుంబానికి తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. ఆయన వెంట తాజా మాజీ సర్పంచ్ పత్రాల శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ పద్మవెంకటేశ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య, వార్డుసభ్యులు కొండల్, పోచాగౌడ్, సీనియర్ నాయకులు బాసంపల్లి రామాగౌడ్, చింతకింది రాజు, వంశీ, పీఎంజీ యువసేన సభ్యులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి కంఠారెడ్డి పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

నిజాంపేట, జూన్ 8: నిజాంపేటకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సదాశివలింగం మాతృమూర్తి సత్యవ్వ(80) కొంతకాలంగా అనారోగ్యంతో మృతి చెందింది. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి శనివారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నాగరాజు, మాజీ ఎంపీటీసీ చింతల స్వామి, వెంకటస్వామిగౌడ్, కల్వకుంట రైతు బంధు సమితి అధ్యక్షుడు రాంచంద్రరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ రవి, యూత్ మండల అధ్యక్షుడు మావురం రాజు, కొండల్‌రెడ్డి, మాధవరెడ్డి, రాములు, నర్సింహులు తదితరులు ఉన్నారు.

చాకరిమెట్లలో విశేష పూజలు

ఆంజనేయస్వామికి పూజ చేస్తున్న భక్తులు

శివ్వంపేట, జూన్ 8: మండలంలోని చిన్నగొట్టిముక్ల పంచాయతీ పరిధిలో వెలిసిన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, అష్టోత్తర నామాలతో పూజలు చేయించారు. భక్తులు సత్యనారాయణస్వామి వ్రతాలు, చందనాభిషేకం చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు దేవదత్తశర్మ, దేవీశర్మ, ప్రభురాజశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

పాపన్నపేట, జూన్ 8 : ఓ హత్య కేసులో నిందితుడు చెప్పిన ఆధారాలతో మరో మహిళ హత్య మిస్టరీ వీడింది. గత నెల 28న సదాశివపేటకు చెందిన బస్వరాజు ఏడుపాయల్లో ఆనెల్లి అనసూయను హత్య చేశాడు. ఈ ఘటనలో అతడిని పోలీసులు అరెస్టు చేసి విచారిస్తుండగా.. తాను మరో మహిళను హత్య చేసినట్లు తెలిపాడు. ఈ మేరకు శనివారం కోడిగుడ్ల పోచమ్మ (40) మృతదేహాన్ని ఏడుపాయల్లో కనుగొన్నట్లు పాపన్నపేట ఎస్సై నరేశ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. సదాశివపేటలో నివాసముంటున్న కోడిగుడ్ల పోచమ్మ అక్కడున్న హోటల్‌లో పని చేస్తూ జీవిస్తున్నది. ఆమెకు కూతురు, ముగ్గురు కుమారులు ఉన్నారు. 15 రోజుల నుంచి కనిపించకుండా పోయింది. ఆమె కుటుంబీకులు సదాశివపేట పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అంతకు ముందుకు అనసూయ హత్య కేసులో నిందితుడైన బస్వరాజ్ ఇచ్చిన సమాచారం మేరకు పోచమ్మ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నరేశ్ తెలిపారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు పరామర్శ

మృతురాలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

చిలిపిచెడ్, జూన్ 8: మండలంలోని శీలాంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, ఫైజాబాద్ మాజీ ఎంపీటీసీ లలితారెడ్డి అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. కాంగ్రెస్ నాయకురాలు చిలుముల సుహాసినిరెడ్డి మృతురాలి ఇంటింటికెళ్లి ఆమె భర్త సోమక్కపేట పీఏసీఎస్ చైర్మన్ ధర్మారెడ్డిని పరామర్శించారు. అనంతరం

వృద్ధాశ్రమంలో అన్నదానం

ఓల్డ్ ఏజ్ హోమ్‌కు 50 కిలోల బియ్యం బస్తాను విరాళంగా అందజేశారు.

నర్సాపూర్, జూన్ 8: నర్సాపూర్‌లోని విజన్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో బీవీఆర్ఐటీ ఫౌండర్ బీవీరాజు వర్ధంతి సందర్భంగా దాతలు వృద్ధులకు శనివారం అన్నదానం, పండ్ల పంపిణీ చేశారు. విజన్ సంస్థల ప్రతినిధి అభర్ణ సుధాకర్‌రెడ్డి తల్లి వర్ధంతి సందర్భంగా భోజనాలు ఏర్పాటుచేశారు. నర్సాపూర్‌కు చెందిన సంతోష్, ఈశ్వర్, అజీజ్‌లు విజన్

ప్రిలిమ్స్‌కు సర్వం సిద్ధం

- జిల్లాలో 10 పరీక్షా కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 3,912 మంది అభ్యర్థులు
- నిమిషం నిబంధన వర్తిస్తుంది
- ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు

మెదక్‌లోని పరీక్షా కేంద్రం

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 8: నేడు జరిగే ప్రిలిమినరీ పరీక్షకు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలో 10 పరీక్షా కేంద్రాల్లో మెదక్‌లో 7, నర్సాపూర్‌లో 3 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 3,912 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగనున్నది. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్షలు సీసీ కెమెరాల నిఘాలో నిర్వహించనున్నాయి. దివ్యాంగులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు ముందుగానే చేరుకోవాలని, ఆలస్యమైన వారిని అనుమతించమని అధికారులు స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లేందుకు అనుమతిలేదు. ఇన్విజిలేటర్లకు సైతం ఇదే నిబంధన వర్తిస్తుంది. చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే సెల్ ఫోన్ అనుమతి ఉంది. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశించారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగకుండా ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ అధికారులు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు నడిపించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పరీక్షకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లాలోని పరీక్షా కేంద్రాలు..

క్రమ సంఖ్య	పరీక్షా కేంద్రం	అభ్యర్థుల సంఖ్య
1.	ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్	699
2.	గీతా జూనియర్ కళాశాల మెదక్	384
3.	సిద్దార్థ్ మోడల్ హై స్కూల్ మెదక్	480
4.	గీతా హైస్కూల్ మెదక్ - 1	240
5.	గీతా హైస్కూల్ మెదక్ - 2	573
6.	ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల మెదక్	288
7.	సిద్దార్థ్ ఆదర్శ జూనియర్ కళాశాల మెదక్	432
8.	బీవీ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - ఎ	264
9.	బీవీ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - బీ	264
10.	బీవీ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - సీ	288
	మొత్తం అభ్యర్థులు	3,912

పరీక్ష సజావుగా జరగాలి

కలెక్టర్ రాహుల్ రాజ్

గీతా స్కూల్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 8: నేడు జరిగే గ్రూప్-1 పరీక్ష సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని పలు పరీక్షా కేంద్రాలను ఆయన సందర్శించి, మంబోజిపల్లి గీతా స్కూల్ పరీక్షా కేంద్రంలో ఇన్విజిలేటర్లకు పరీక్ష నిర్వహణపై అవగాహన కల్పించారు. పరీక్షలో పొరపాట్లు జరగకుండా నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. సమయపాలనలో ఎలాంటి మినహాయింపులు లేవన్నారు. ఆభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు నమోదు 9.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. అభ్యర్థులు బూట్లు వేసుకోవద్దని చెప్పులు మాత్రమే వేసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట టీజీపీఎస్పీ అబ్జర్వర్ రోహిత్‌కుమార్, రీజినల్ కోఆర్డినేటర్ హుస్సేన్, ఇన్విజిలేటర్లు ఉన్నారు.

మీనం.. ఎగబడ్డ జనం

కిటకిటలాడుతున్న మెదక్ చేపల మార్కెట్

ప్రకృతికి అనుగుణంగా వచ్చే మార్పులను ప్రజలు స్వాగతిస్తారు. తెలంగాణలో విశేషంగా భావించే మిర్గం (మృగశిర కార్తె)ను శనివారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ కార్తె ప్రవేశిస్తున్న సమయంలో చేపలు తింటే ఉబ్బసం వ్యాధితో పాటు పలురోగాలు దరిచేరవనే నమ్మకం అనాదిగా వస్తున్నది. దీంతో మెదక్ జిల్లా వ్యాప్తంగా ఉన్న చేపల మార్కెట్లలో చేపల విక్రయాలు జోరుగా సాగాయి. నిన్న, మొన్న రూ.150 వరకు కిలో ఉన్న రవ్వ, బొచ్చ, బంగారు తీగ చేపలు రూ.250కి పైగా ధర పలికాయి. రూ.500లకు కిలో పలికే కొర్రమీను రూ.800ల వరకు అమ్ముడుపోయాయి. శాఖాహారులు మామిడి పండ్ల రసం, అట్లు తినడం తరాలుగా కొనసాగుతున్నది. తొలకరి జల్లులతో ఎలాంటి అంటురోగాలు రాకుండా ఇంగువను బెల్లంలో కలిపి చిన్న చిన్న మాత్రలుగా చేసి వేసుకున్నారు.

- న్యూస్ నెట్‌వర్క్, మెదక్, జూన్ 8

రామాయంపేటలో చేపల మార్కెట్‌లో చేపల విక్రయాలు

నర్సాపూర్‌లో..

చిలిపిచెడ్ : చిట్కుల్‌లో..

నిజాంపేటలో..

కొనసాగుతున్న బడిబాట

రామాయంపేట: గొల్పర్తి గ్రామంలో ప్రచారం చేస్తున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు

చిలిపిచెడ్: గౌతాపూర్‌లో బడిబాటలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

గ్రామాల్లో బడిబాట కార్యక్రమం కొనసాగుతున్నది. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి కోరారు. ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మెరుగైన విద్య తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. మూడేండ్లు పైబడిన పిల్లలను కచ్చితంగా బడిలో చేర్పించాలని తెలిపారు. బడి బయట ఎవరూ తిరగరాదని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో మండల అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- రామాయంపేట/కొల్చారం/చిలిపిచెడ్, జూన్ 8

కొల్చారం: రాంపూర్ ప్రైమరీ స్కూల్‌లో ఏకరూప దుస్తులు అందజేస్తున్న ఎంపీడీవో లక్ష్మీ నర్సింహులు

ప్రత్యేక పాలనలో పడకేసిన పారిశుధ్యం

చండూర్‌లో అధ్వానంగా మురుగు కాల్వ

చిలిపిచెడ్, జూన్ 8: మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక పాలనలో పారిశుధ్యం పడకేసింది. ఐదు నెలల నుంచి మురుగు కాల్వలు శుభ్రం చేయించే వారు కరువయ్యారు. మండలంలోని చండూర్ గ్రామంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట, చిట్కుల్ మురుగు కాల్వలో ప్లాస్టిక్ గ్లాసులు, డబ్బాలు, తాజా మాజీ వార్డు సభ్యుడు ఇంటి పక్కన ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నది. మురుగు కాల్వలు శుభ్రం చేయించడంలో అధికారులు చిత్తశుద్ధి కొరవడింది. మండలంలోని గౌతాపూర్, అజ్జమర్రి, సోమక్కపేట, శీలాంపల్లి, జగ్గంపేట, రహీంగూడ తండా, టోప్యా తండా గ్రామాల్లో మురుగు కాల్వల పరిస్థితి అధ్వానంగా తయారయ్యింది. ఎక్కడ చూసినా చెత్తతో నిండి కంపు కొడుతున్నాయి. దీంతో దోమలు, ఈగలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామాల్లో సందర్శించి, తగిన చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చిట్కుల్‌లోని మురుగు కాల్వలో నిలిచిన నీరు, ప్లాస్టిక్ డబ్బాలు

అటకెక్కిన ఆహ్లాదం

- పల్లె ప్రకృతి వనానికి ఆదరణ కరువు
- పట్టించుకోని అధికారులు
- పశువులు, వాహనాల కోసం వాడుకుంటున్న కొందరు

తూప్రాన్ మండలం ఘనపూర్‌లోని పల్లె ప్రకృతి వనంలో శిథిలావస్థకు చేరుకున్న ఆటవస్తువులు

తూప్రాన్/మనోహరాబాద్, జూన్ 8: గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన పల్లె ప్రకృతి వనాలకు ఆదరణ కరువైంది. కేసీఆర్ పాలనలో పల్లె ప్రకృతి వనాలను అందమైన మొక్కలు, ఆట వస్తువులతో తీర్చిదిద్ది, పిల్లలు, పెద్దల కోసం ఆహ్లాదకరంగా మార్చారు. ప్రస్తుత ప్రభుత్వం వాటిని పట్టించుకున్న పాపాన పోవడం లేదు. వాటి నిర్వాహణను గాలికి వదిలేసింది. తూప్రాన్ మండలం ఘనపూర్‌లో పల్లె ప్రకృతి వనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఉయ్యాలలు విరిగిపోయాయి. రంగులరాట్నం, జారుడు బండ శిథిలావస్థకు చేరుకున్నాయి. పిచ్చి మొక్కలు మొలిచి విష పురుగులు సంచరిస్తున్నాయి. కొంతమంది పశువులు, వాహనాలను అందులో ఉంచుతున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పెద్దశంకరంపేట, జూన్ 8: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దశంకరంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పేట ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దశంకరంపేటకు చెందిన నాందేడ్ యాదగిరి (31) తరుచుగా మద్యం సేవించి భార్యతో గొడవపడేవాడు. దీంతో యాదగిరి భార్యా పిల్లలతో కలిసి తల్లిగారింటికి వెళ్లింది. రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులు సముదాయించి భార్యాభర్తలు బాగుండాలని చెప్పి, మెప్పించి ఇంటికి పంపించారు. శుక్రవారం రాత్రి మళ్లీ తాగి వచ్చి యాదగిరి భార్యతో గొడవ పెట్టుకున్నాడు. అందరూ సముదాయించినా బుద్ధిరాలేదని భార్య మందలించడంతో యాదగిరి రూమ్‌లోకి వెళ్లి తలుపులు పెట్టుకున్నాడు. ఉదయం 7 గంటలైనా బయటకు రాకపోవడంతో తలుపులు తీయగా ఉరేసుకుని మృతి చెందాడు. మృతుడి భార్య నాందేడ్ ఉష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య ఉష, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

మృతదేహం లభ్యం

తూప్రాన్, జూన్ 8: చేపల వేటకు వెళ్లి గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం లభించింది. నర్సింలు (40), మరో ఇద్దరితో కలిసి శుక్రవారం తూప్రాన్‌లోని చెరువులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు శనివారం మృతదేహాన్ని వెలికితీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేపు చిలిపిచెడ్ మండల సర్వ సభ్య సమావేశం

చిలిపిచెడ్, జూన్ 8: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఆనంద్ తెలిపారు. సోమవారం నిర్వహించనున్న మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన సూచించారు.

ఎంపీలకు మురళీయాదవ్ శుభాకాంక్షలు

నర్సాపూర్, జూన్ 8: ఎంపీలను ఆ పార్టీ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ శనివారం ఢిల్లీలో కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, గోవా సీఎం ప్రమోద్ సావంత్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మెదక్ పార్లమెంట్ కో-కన్వీనర్ శ్రీనివాస్, నర్సాపూర్ అసెంబ్లీ కో-కన్వీనర్ సతీశ్‌యాదవ్ ఉన్నారు.

బుస్సారెడ్డిపల్లిలో ఘనంగా బోనాలు

మునిపల్లి, జూన్ 8: మండలంలోని బుస్సారెడ్డిపల్లిలోని నల్ల పోచమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఘనంగా బోనాలు నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు నెత్తిన బోనాలతో ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOTS for SALE
Peram
ఘంట్‌గిర్ ORR ప్రక్కన HMDA, RERA Approval కలిగి ఉన్న, బ్యాంకు రుణసౌకర్యానికి అనువైన లేఅవుట్ ప్లాట్లు అమ్మకానికి కలవు.
బ్యాంక్ లోన్ సదుపాయం కలదు.
గమనిక: ఈ లేఅవుట్ బుట్టపుక్కల గేటెడ్ కమ్యూనిటీ హౌసింగ్, విల్లాస్ ఉన్నవి. మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను.
Trendz apartments, Gachhibowli
9849 162 168

PLOT FOR SALE
★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్, SBI దగ్గర 161 చ.గ. ఇంటి స్థలం అమ్మబడును. వివరాలకు సంప్ర: 8143366630 / 9989554915.
NT-334218

WANTED
★బ్యాట్రి, సెల్ఫ్ మోటార్ ఆటో ఎలక్ట్రికల్ వర్క్ పని వచ్చినవారు కావలెను. పురుషులు మాత్రమే. Ph: 9849727105.
NT-333877

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న ఒప్పందములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.